# పెళ్ళిరోజు

**- పునర్వసు**

తాతల నాటి గోడ గడియారం నాలుగ్గంటలు కొట్టింది. ఉలిక్కిపడి లేచిన శ్రీమతికి బయటి నుంచీ వీధి తలుపు తడుతూన్న శబ్దం వినిపించింది. ఒక్కసారి గోడ గడియారం కేసి చూసి, 'అరె! పిల్లలప్పుడే స్కూలు నుంచీ వచ్చేసినట్టున్నారే!' అని గబ గబా వెళ్లి తలుపు తీసింది.

ఎదురుగా గుమ్మంలో భర్త కనిపించాడు.

ఒక్కడుగు వెనక్కి వేసి- 'మీ. మీ.. మీరా!' అంది శ్రీమతి తడబడుతూ.

'అవునోయ్ శ్రీమతీ! నేనే.. నీ పతిని.. నీ పతినే!' అన్నాడు చిలిపిగా శ్రీమతి కళ్లలోకి చూస్తూ.

'ఎంతసేపైంది వచ్చి...' అడిగింది శ్రీమతి భయం భయంగా.

'అబ్బే! ఎంతో సేపు కాలేదోయ్! ఇప్పుడే! జస్ట్ ఫిఫ్టీన్ మినిట్స్ అయింది' అన్నాడు చాలా తేలిగ్గా, లోపలికి వస్తూ.

రోజూ రాత్రి ఏ తొమ్మిదిన్నర, పదిన్నరకో అలసిపోయి, చిరాగ్గా యిల్లు చేరే భర్త ఆ రోజు సాయంత్రం నాలుగ్గంటలకే యిల్లు చేరడం... తలుపు తియ్యడం ఒక్క క్షణం ఆలస్యమైనా చర్రున అంతెత్తు లేచే మనిషి పావుగంట నుంచీ తలుపు తడుతున్నా తలుపు తియ్యని తనని

---

**చిట్టికథల పోటీలో రూ. 150/- బహుమతి పొందిన కథ**

---

పల్లెత్తుమాట అనక పోవడం... పైగా ఎప్పుడూ ఏయ్, ఏమేవ్, ఒసేవ్ అని పిలవడమే తప్ప ఏనాడూ పేరు పెట్టి పిలిచెరుగని మనిషి ఆ రోజు 'శ్రీమతీ' అని నోరారా ఆప్యాయంగా పిలవడం... ఇవన్నీ కలో- నిజమో తేల్చుకోలేని అయోమయావస్థలో పడేశాడు శ్రీమతిని.




'ఏమిటోయ్ శ్రీమతీ! అలా వులుకూ, పలుకూ లేకుండా వుండిపోయావు. నిద్రమత్తింకా వదల్లేదా!' అన్నాడు శ్రీపతి, ఆమె భుజాలు పట్టికుదుపుతూ.

ఆ కుదుపుకి- 'ఆ' అంది శ్రీమతి ఉలిక్కిపడి.

'ఆ లేదు- ఈ లేదు. ముందు నువ్వా పరధ్యాన్నం లోంచి బయటపడి త్వరగా డ్రస్సప్ అయిరా' అనీ తొందర చేశాడు శ్రీపతి.

'ఎందుకండీ!' అడిగింది శ్రీమతి భర్త ప్రవర్తన అర్థంగాక.

'ఎందుకేమిటోయ్! ఇవాళ జూన్ ఇరవై యేడు..' అన్నాడు హుషారుగా.

'అయితే ఏమిటీ!' సాగదీసింది శ్రీమతి.

"ఏమిటేమిటీ! ఇవాళ మన పెళ్లిరోజోయ్! ఇవాళ్టికి సరిగ్గా పదిహేనేళ్లక్రితం.. ఇదే రోజున మనమిద్దరం ఇలా.. ఇలా... ఒక్కటయ్యాం." అని శ్రీమతి నడుం చుట్టూ చేతులు వేసి దగ్గరకు లాక్కున్నాడు.

శ్రీమతి సిగ్గుమొగ్గైంది ఆ క్షణంలో.

చాల్లెండి సంబరం' అని భర్త చేతుల్లోంచి తప్పించుకుని వంటింట్లోకి తుర్రుమంది.

శ్రీపతి హుషారుగా ఈలవేసుకుంటూ పడక గదిలోకెళ్ళి అయిదు నిమిషాల్లో టిప్‌టాప్‌గా తయారై వచ్చేడు. ఆ సరికే శ్రీమతి కాఫీ కప్పుతో ఎదురైంది.

భార్య చేతిలోని కాఫీ కప్పు అందుకుని- "ఇంకా ఇలాగే వున్నావేమిటోయ్! త్వరగా తయారవ్! బయటికెళ్దాం" అన్నాడు.

'ఎక్కడికండీ'

'ఎక్కడికేమిటీ.. నీ మొహం.. సినిమాకి'

'అసలే నెలాఖరు. ఇప్పుడెందుకండీ సినిమా, డబ్బుదండగ'

ఈ సారి నిర్ఘాంత పోవడం శ్రీపతి వంతైంది.

ఒకప్పుడు పెళ్లిరోజున కొత్త చీర కావాలని పేచీపెట్టే శ్రీమతి, కొత్త చీర లేకపోతే మానె.. కనీసం ఓ సినిమాకో... షికారుకో వెళ్లడానిక్కూడా నోచుకోని వెధవ బ్రతుకు అని విసుక్కునే శ్రీమతి, ఇప్పుడు 'ఎందుకండీ సినిమా.. డబ్బుదండగ' అనడం వింతగా తోచింది శ్రీవారికి.



'ఏమిటండీ! అలా మాటా పలుకూ లేకుండా వుండిపోయారు!' అని భర్తని పట్టి కుదిపింది శ్రీమతి.

'అబ్బే! ఏం లేదు. ఈ పదిహేనేళ్లలో నీలో ఎంత మార్పొచ్చిందా అని...' అన్నాడు ఖాళీ కప్పు శ్రీమతి చేతికిస్తూ.

'బావుంది. మీలో మాత్రం మార్పు రాలేదాయేం! ప్రతిసారీ నా అంతట నేను మన పెళ్లిరోజుని గుర్తుచేస్తే- మీరు నా మీద మండిపడేవారు. అలాంటిది- ఇప్పుడు మీరే...'

'అలా మండి పడడానికి కారణం- నీ మీద కోపంకాదోయ్! మన పెద్దవాళ్ల మీద కోపం' అన్నాడు శ్రీపతి.

'మన పెద్ద వాళ్ల మీద కోపమా! ఎందుకూ!' అడిగింది శ్రీమతి ఆశ్చర్యంగా.

'ఎందుకేమిటి! నెలాఖర్లో మన పెళ్లి ముహూర్తం పెట్టించినందుకు!' అన్నాడు సీరియస్‌గా.

పకా పకా నవ్వింది శ్రీమతి.

'ఎందుకోయ్! అంతగా నవ్వుతావ్! నన్ను చూస్తే నీకు నవ్వొస్తోందా!' అన్నాడు శ్రీపతి చిరు కోపం నటిస్తూ.

'లేకపోతే ఏమిటండీ.. పెళ్లి ముహూర్తాలు వధూవరుల జాతకాల్ని బట్టి, తిథి, వార, నక్షత్రాల్ని బట్టి- వాళ్ల వాళ్లవీలును బట్టి, నిర్ణయిస్తారుగానీ నెల మొదలు- నెలాఖరు చూసి నిర్ణయిస్తారా ఎవరైనా!' అంది నవ్వుతూ.

'ఎవరు ఎలా నిర్ణయించినా, ముఖ్యంగా మనలాంటి మధ్య తరగతి కుటుంబాల్లో మాత్రం నెల మొదట్లో- ఆ 'గోల్డన్ వీక్'లోనే ముహూర్తాలు పెట్టుకోవాలి' అన్నాడు శాసనం చేస్తున్నట్టుగా.

'సరే? రేపొద్దున్న మీ పిల్లలకి మీరు పెళ్లిళ్ళు చేసేనప్పుడు అలాగే చేద్దురుగాని'- ఎగతాళిగా మూతివిరిచి, ఖాళీ కప్పు తీసుకుని లోపలికి వెళ్లింది శ్రీమతి.

'వాళ్ల పెళ్లిళ్ల సంగతి తర్వాత చూద్దాం.. ముందు నువ్వు త్వరగా బయల్దేరు- సినిమాకి టైమవుతోంది' అని ఓ కేకేసి- వీధి గుమ్మంలో నిలుచున్నాడు శ్రీపతి.

అప్పుడే స్కూలు నుంచి ఇంటికి వచ్చిన ముగ్గురు కూతుళ్లనీ చూసి- 'ఎప్పుడో స్కూలు వదిలేస్తే ఇప్పుడా రావడం?' అని గదమాయించాడు శ్రీపతి.

'మా ఫ్రెండ్ వాళ్ల యింట్లో హోంవర్క్ చేసుకుని వస్తున్నాం' అన్నారు ముగ్గురూ ముక్త కంఠంతో...

'సరి సరి! నేనూ మీ అమ్మా అర్జెంట్ పనిమీద బయటికెళ్తున్నాం. వచ్చే సరికి రాత్రి పది అవుతుంది. తలుపు వేసుకొని జాగ్రత్తగా వుండండి!' అని హెచ్చరించాడు.

'ఓ.. అలాగే' అని ముగ్గురూ ఇంట్లోకి పరుగెత్తారు.

అంతలోనే శ్రీమతి ముస్తాబై ముందు గదిలో కొచ్చింది. గుమ్మంలో ఎదురైన పిల్లల్ని తనూ మరోసారి హెచ్చరించింది. భర్తతో బయటికి నడిచింది.

ఇద్దరూ మెయిన్‌రోడ్డు మీదకి రాగానే- ఓ ఆటో ఎదురైంది. శ్రీపతి ఆటోని పిలిచాడు.

ఆటో వచ్చి ఆగింది. ఇద్దరూ ఎక్కి కూచున్నారు.

'అలంకార్‌కి పోనీ' అన్నాడు శ్రీపతి. ఆటో కదిలింది.

మరో పదిహేను నిమిషాల్లో థియేటర్ ముందు ఆగింది ఆటో. ఇద్దరూ ఆటోలోంచి దిగారు. మీటర్ చూశాడు శ్రీపతి. ఇరవై రూపాయల యింది. డబ్బులివ్వడానికి జేబులో చెయ్యి పెట్టిన శ్రీపతి 'కరెంట్ షాక్' తిన్నవాడిలా అదిరిపడి 'మైగాడ్' అని అరిచాడు.

ఆ అరుపుకి శ్రీమతి, ఆటోడ్రైవరూ అదిరి పడ్డారు.

'ఏమైందండీ' అంది శ్రీమతి ఆదుర్దాగా.

'నా పర్స్.. నా పర్స్' అని కంగారుగా పేంటు జేబులు, చొక్కా జేబులు తడుముకోసాగాడు.

ఆటోడ్రైవర్ శ్రీపతి కేసి అనుమానంగా చూశాడు.

అంతలోనే శ్రీమతి- 'అవునూ- ఇందాక నేను వంటింట్లో వెళ్లినప్పుడు- మీరు పేంటు మార్చుకున్నారు కదూ." అంది.

'యస్! కరెక్టుగా గుర్తు చేశావు. పేంటు మార్చుకున్నప్పుడు పర్స్ సంగతే మర్చిపోయాను. ఛ.. ఛ...' అని విసుక్కున్నాడు.

'పోనీలెండి! ఇప్పుడేమైంది గనక. ఇదే ఆటోలో ఇంటికెళ్లి పోయి ఆటోని పంపించేద్దాం.' అని ఆటోలో కూచుంది శ్రీమతి.

'ఇంటికి పోనీవోయ్' అంటూ శ్రీపతి ఆటోలో కూచున్నాడు.

ఆటో కదిలింది.

ఇంటి ముందు ఆటో ఆగీ ఆగగానే ఒక్క ఉదుటన బయటికి గెంతి, ఇంటి తలుపులు దబ దబా బాదాడు. తలుపులు తెరచిన పెద్దకూతుర్ని



పంచదార డబ్బాలో చీమలు పడుతున్నాయా!... రెండు లవంగాలు పంచదార మీద వేసి ఉంచండి చాలు. చీమలు పట్టడం ఆగిపోతుంది.

పక్కకి తోసేసి సరాసరి పడగ్గదిలోకి పరుగు తీశాడు ఆ వెంటనే- శ్రీమతి కూడా భర్తని అనుసరించింది.

తల్లిదండ్రుల ప్రవర్తన అర్థంగాక ముగ్గురు పిల్లలూ ఒకళ్ల మొహాలు ఒకరు చూసుకోసాగారు.

గదిలో- సాయంత్రం ఆఫీసు నుంచీ ఇంటికి వచ్చినప్పుడు కట్టి విడిచిన పేంటు జేబులు వెతగ్గా. అందులో ఒక జేబు కత్తిరించబడి వుండడం చూసి 'శ్రీమతీ' అని అరిచాడు బిగ్గరగా.

'ఏమైందండీ' అంది ఆదుర్దుగా శ్రీపతి భర్తని సమీపించి. అతని చేతిలోని పేంట్ జేబు చిరుగు చూసి- 'ఏమిటండీ ఇది!' అడిగింది ఆశ్చర్యంగా.

'ప్రతీసారి నెలాఖర్లో వచ్చే మన పెళ్లి రోజున ఏ ముద్దూ ముచ్చటా జరపకుండా నిన్ను 'డిజప్పాయింట్' చేస్తున్నాననే బాధతో, ఈ సారైనా 'సర్ప్రైజింగ్'గా నిన్ను సంతోషపెట్టాలని ఆఫీసులో కొత్తగా చేరిన ఓ గుమస్తాని అడిగి వంద రూపాయలు అప్పుతెచ్చాను. ఇందాకా బస్సులో యింటికి వస్తున్నప్పుడు అది కాస్తా ఎవరో కొట్టేశారు. ఇప్పుడు ఈ ఆటో అతని... ఏం చెయ్యాలో తోచడంలేదు' అని దాదాపు ఏడుపు మొహం పెట్టేశాడు శ్రీపతి.

'ఉండండి! ఇప్పుడే వస్తాను' అని వంటింట్లోకెళ్లి వెంటనే తిరిగొచ్చింది శ్రీమతి.

ఆమె చేతిలో- అక్కడక్కడ పసుపు మరకల్తో బాగా నలిగిపోయివున్న కొత్త యాభై రూపాయల నోటు కనిపించింది.

ఆనందంతో కళ్లు మెరిశాయి శ్రీపతికి ఆపదలోంచి బయటపడబోతున్నందుకు.

అంతలోనే, ఏదో అనుమానం వచ్చి- 'దేవుడికి ముడుపు కట్టిన డబ్బు తీసిస్తున్నావా' అన్నాడు బాధగా.

'దేవుడికి ముడుపు కట్టిన డబ్బు కాదండీ ఇది! స్వయంగా మీరే నాకు ఇచ్చిన డబ్బు' అంది సౌమ్యంగా.

ఆశ్చర్యంగా- ప్రశ్నార్థకంగా చూశాడు శ్రీపతి.

'ఇంకా నమ్మకం చాల్లేదా శ్రీవారికి!' అని నవ్వి 'చెప్తానండి' అని ఇలా చెప్పసాగింది.

'పదిహేనేళ్ల క్రితం- ఇదే రోజున- మన పెళ్లి రోజున.. తొలిరాత్రి.. శోభనం గదిలో నాకు తెలీకుండా నా పతిదేవుడు అంటే మీరు నాకొంగున ముడి కట్టిన డబ్బుసార్ ఇది! ఇంకేం ఆలోచించకుండా త్వరగా వెళ్లి ఆటో అబ్బిని పంపేసి రండి. ఈ లోగా భోజనం ఏర్పాట్లు చేస్తాను అయినా పెళ్లిరోజున బయట తిరిగి ఖర్చు పెడితేనే ఆనందమా చెప్పండి. ఇల్లూ, పిల్లలే బృందావనం కదూ.' అంది శ్రీమతి చిలిపిగా శ్రీపతి బుగ్గగిల్లి వంట ఇంట్లోకి వెళ్తూ. ❐